సమస్యలపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్ బస్తీతో పాటు ప్రధాన రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సాయి మల్లిక్ కోరారు. సోమవారం ఉదయం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ప్రజా సమస్యలను వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాన రహదారితో పాటు అంతర్గత బస్తీలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లపై ప్యాచ్‌వర్క్‌ను నిర్వహించాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులను పిలిపించి చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారన్నారు.

భవానీ కాలనీ ఆధ్వర్యంలో..

మైలార్‌దేవ్‌పల్లి: భవానీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో సమస్యలను వివరించారు. రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పెండింగ్‌లో ఉన్న కన్వెన్షన్‌హాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ సమస్యలపై గతంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించానని తెలిపారు. వెంటనే మళ్లీ అధికారులతో సమావేశం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీలు, కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి ప్రత్యేక నిధులను మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అమృతవల్లికి పురస్కార ప్రదానం



అమృతవల్లికి పురస్కారాన్ని అందజేస్తున్న సరస్వతి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాతృభాషలో రాణిస్తున్న అమృతవల్లికి యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేసింది. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో మలేషియా ఉప మంత్రి సరస్వతి కందసామి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. మన సంస్కృతికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకోవడం పట్ల సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పురస్కారాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామచంద్ర, పవన్ పాల్గొన్నారు.

అన్నదానం

గోల్కొండ: పేదలకు అన్నదానం చేయడమే తమ ఆశయమని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన పలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువగా నిరుపేదలే ఉంటారని అన్నారు. అటువంటి వారికి ప్రతిరోజూ భోజనం అందించడానికి తాను కృషి చేస్తున్నాన్నారు.



ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సాయిదత్త గణపతి ఆలయం



పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. ఆలయ నిర్వాహకులు డి రవీందర్ రెడ్డి, డి నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వివివిఎస్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను జరిపారు. ఆలయంలో ఉదయం షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో రుద్ర హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి చేశారు. విష్ణు సహస్ర నామసహిత లక్ష్మీ అష్టోత్తర పారాయణం, సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం చేశారు. సాయంత్రం కాలనీలో సాయిబాబా పల్లకిసేవ (నగరసంకీర్తన) రాత్రి శేజ్ హారతితో వేడుకలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివాని దర్శించుకున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మనుషులను యంత్రాలుగా మార్చే కృత్రిమ మేధస్సుకు సమాజంలో కుటుంబ, మానవీయత విలువలకు ముప్పు వాటిల్లుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సాధన సాహితి శ్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ బి.రామాచార్యులు రచించిన నామస్మరణం-మోక్ష దాయకం పుస్తకాన్ని సోమవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నేటి తరం పిల్లలకు దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి సమస్యలను అధిగమించేందుకు పురాన కథలు, పద్యాలతోపాటు దైవనామస్మరణ ఎంతో ఉపయోగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సినీ గేయ కవి వెనిగళ్ల రాంబాబు, సంస్థ అధ్యక్షులు సాధన నర్సింహాచార్య, కార్యదర్శి సంభుని కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరద నీరు.. రాకపోకలు మళ్లింపు

శేరిలింగంపల్లిలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను మళ్లించారు. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరదనీటి మళ్లింపు పనులు చేపట్టారు. – శేరిలింగంపల్లి

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ప్రార్థనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు



రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఈద్గాలు, మసీద్‌ల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మత పెద్దలు అన్నారు. సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు కొన్ని చోట్ల వాహనాలను దారి మళ్లించారు. ఇందిరానగర్‌లోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎంఐఎం ఎమ్మెల్సీ రెహమత్ బేగ్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు అలయ్ బలయ్ చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లింలకు కార్పొరేటర్ ప్రతినిధి పాపయ్య యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

అత్తాపూర్: బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్‌లోని ఆయా ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ ఖాద్రీ, సీనియర్ పాత్రికేయులు మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నార్సింగి, గండిపేట, నెక్నాంపూర్ తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద మున్సిపాలిటీలు ఏర్పాట్లు చేశాయి.



బండ్లగూడలో ఈద్గా వద్ద బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ ప్రతినిధి పాపయ్యయాదవ్



పార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

హర్షం

రాయదుర్గం: హోంగార్డుల నియామకం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడం పట్ల హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చాంద్‌పాషా సోమవారం హర్షం వెలిబుచ్చారు. ఓడీ విభాగాలలో పనిచేసే హోంగార్డులకు రెగ్యులర్ డ్యూటీలు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం చేపట్టే నియామకాలలో వీరిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

పరామర్శ

హఫీజ్‌పేట్: మెదక్‌లో జరిగిన దాడి ఘటనలో గాయపడ్డ బీజేవైఎం నాయకుడిని సోమవారం బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పరామర్శించారు. మియాపూర్ పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని కలిసి మాట్లాడారు. గోవధ నిషేధం, గో సంరక్షణ అని ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన ఎక్కడో ఒక చోట రోజు గోవధ జరుగుతూనే ఉందన్నారు. దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీపీ, సీఐలను కోరడం జరిగిందన్నారు. బీజేవైఎం నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు కుమార్‌యాదవ్, అమర్ యాదవ్, మహేష్, మాణిక్ రావు, శ్రీధర్‌గౌడ్, ఆకుల లక్ష్మణ్, జితేందర్, గణేష్ ముదిరాజ్, పవన్ యాదవ్, కోమల్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి రుద్రాక్షల అలంకారం



రాయదుర్గం: గాయత్రీదేవి జన్మదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.సోమవారం కాశీ విశ్వేశ్వర స్వామికి రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. అర్చనలు, అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: గోల్కొండ రిసాల బజార్‌లోని హనుమాన్, శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు, బి.సాయిబాబాచారి టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి

అబిడ్స్: వైద్య సేవల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ టీపీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో మాజీ సీఎం వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీకార్డులు మంజూరు చేశారన్నారు. పదేండ్లుగా ఏ ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్‌కార్డు కాని మంజూరు చేయలేదన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని వెంటనే అర్హులైనవారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేస్తే ఉచిత వైద్య సేవలు పేదలకు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ్, పోల్కం వినయ్‌రాజ్, ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు



జేసీబీతో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

- నేటి సాయంత్రం వరకు స్పెషల్ డ్రైవ్
- ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: బక్రీద్ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో వ్యర్థాల తొలగింపును ఉప కమిషనర్ రవి కుమార్ పర్యవేక్షించారు. మధ్యాహ్నం వర్షం కురవడంతో పనులను మరింత ముమ్మరం చేశారు. ఐదు జేసీబీలు, 18 వాహనాల ద్వారా జంతువుల వ్యర్థాలను తరలించారు. ఇంటింటికీ తిరుగుతూ పారిశుద్ధ్య కార్మికులు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన కవర్లను సేకరించారు. రాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించి బ్లీచింగ్ పౌడర్‌ను వెదజల్లారు. ఈ స్పెషల్ డ్రైవ్ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందని ఉప కమిషనర్ తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్



మంచిరేవులలో విద్యుత్ పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్, వైస్ చైరన్, కౌన్సిలర్‌లు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైరన్ జి.విజయ్‌బాబు అన్నారు. సోమవారం మంచిరేవుల గ్రామంలో పలు చోట్ల విద్యుత్ వైర్ల మార్పు, గృహాలకు సమీపంలో ఉన్న కేబుల్ వైరింగ్, త్రీఫేజ్ లేని వీధులకు సదుపాయం కల్పించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 1 నుంచి 10 వార్డుల వరకు రూ. కోటి, 11వ వార్డు నుంచి 18 వ వార్డు వరకు రూ.కోటి మున్సిపల్ నిధులతో విద్యుత్ వైర్లు, పాత స్తంభాల మార్పు పనులను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కె. నరేశ్, దుర్గేశ్‌యాదవ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు తొలగింపు



రాయదుర్గం: భారీ వర్షం కురవడంతో పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. గచ్చిబౌలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి ప్రాంతాలలో రోడ్లపై భారీ వరద పారింది. దీంతో శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈ విశాలాక్షి, ఇతర అధికారులు, సిబ్బంది నీటిని మ్యాన్ హోళ్ల ద్వారా నాలాలలోకి వెళ్ళేలా ఏర్పాట్లు చేశారు. అన్ని ప్రధాన కూడళ్లను అధికారులు పర్యవేక్షించారు.

నెక్టార్ గార్డెన్ వద్ద వరద సమస్య

నిలిచిన వాహనాల రాకపోకలు

గచ్చిబౌలి: వరద నీటితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్ వద్ద వరద నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై వరద నీరు చేరడంతో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వరద నీటిని తొలగించి, వాహనాలను మళ్లించారు.



మెదక్ ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



రాయదుర్గం: మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావును నానక్‌రాంగూడ బీజేపీ నాయకులు సోమవారం కలిశారు. నానక్‌రాంగూడ శివారులోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా అధికార ప్రతినిధి వరలక్ష్మీ, గచ్చిబౌలి డివిజన్ అర్బన్ జిల్లా కిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు శివసింగ్, బబ్లూసింగ్, జితేందర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో రోడ్డుపై మురుగునీరు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది. గాంధీ అపార్టుమెంట్ సీ బ్లాక్ ముందు భాగంలో గత కొంతకాలంగా డ్రైనేజీ పొంగి రోడ్డుపై పారుతుండడంతో రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. ఈ విషయంలో సీవరేజ్ బోర్డు అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యం



కనిపించకుండా పోయిన బాలుడు

మణికొండ: నార్సింగిలోని వరలక్ష్మి టిఫిన్ సెంటర్ వద్ద నుంచి ఓ బాలుడు కనిపించకుండా పోయిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన గోపాల్ కుమారుడు రవి నార్సింగి నుంచి కనిపించకుండా పోయాడు. అతను నలుపు షర్ట్ ధరించి ఉన్నాడు. ఏడు సంవత్సరాల వయస్సు ఉంటుందని, అతని వివరాలు తెలిసిన వారు 94910390343 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తల్లి ప్రేమ వెలకట్టలేనిది



చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ఈ సృష్టిలో వెలకట్టలేనిది తల్లి ప్రేమ అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'ఎన్డ్ లెస్ లవ్' చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. తల్లిప్రేమ గురించి ఎంతచెప్పినా తక్కువేనన్నారు. పాఠశాల స్థాయి నుంచి అద్భుతమైన చిత్రాలను గీసిన చిన్నారులను కొనియాడారు. ఈ చిత్రకళా ప్రదర్శన ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని సంస్థ నిర్వాహకులు రమేష్ తెలిపారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం చిత్రకళ బోధకులు మహేష్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

3 తులాల బంగారు గొలుసు అపహరణ

హఫీజ్‌పేట్: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శివాజీనగర్‌లో నివాసముండే తులసి లక్ష్మి (28) సోమవారం గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో విధులు ముగించుకొని లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి శివాజీనగర్‌కు వస్తుండగా సిటిజన్ కాలనీ సమీపంలోకి రాగానే ఆమె పక్క నుంచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. దీంతో ఆమె చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం కాలనీలోని పరిసర ప్రాంతాలలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

దంచికొట్టిన వాన



గోల్కొండ: భారీ వర్షానికి నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై సుమారు రెండు అడుగుల మేర నిలిచిపోయింది. టూమ్స్ రోడ్డుపై భారీగా వరద నీరు చేరడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. గోల్కొండలోని లోతట్టు ప్రాంతాలైనా హీరాఖానా, నయాకీలా రోడ్లు మొత్తం జలమయమయ్యాయి. గుడిమల్కాపూర్ ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు ప్రవహించింది. టోలిచౌకీ నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సైతం భారీగా వరద నీరు చేరింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

యాకుత్‌పురా: సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. తలాబ్ కట్టా, నషేమన్‌నగర్, చాచాగ్యారేజ్, మొఘల్‌పురా, బీబీ బజార్ చౌరస్తా, బడాబజార్, హరిబౌళి, బేలాచౌరాస్తా, ఎస్ఆర్టీ కాలనీ, రెయిన్‌బజార్, ముర్తుజానగర్, యాకుత్‌పురా రైల్వే స్టేషన్, జఫర్ రోడ్డు, యశ్రఫ్ నగర్, మదీనానగర్, దోభీఘాట్, సరస్వతీనగర్, సుల్తాన్‌షాహి, వాల్మీకినగర్, ఎత్తేబర్‌చౌక్, గంగానగర్‌నాలా తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రోడ్లలోని డ్రైనేజ్ మ్యాన్‌హోళ్లల్లో చెత్త పేరుకుపోవడంతో వరద నీరు ముందుకు సాగాక ఎక్కడిక్కడే నిలిచి పోయింది. వరదనీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.